నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, సోమవారం 4 నవంబర్ 2024 | VIKARABAD


## తప్పని ఉక్కపోత



సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. దీంతో పగలు కొంత ఉక్కపోత తప్పడం లేదు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 31.4, కనిష్ఠం 21.3 డిగ్రీలు, గాలిలో తేమ 63 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# కోతలకు అంతే లేదా..

## గ్రేటర్‌లో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం

- నగరంలో పలు చోట్ల విద్యుత్ వినియోగదారుల దినోత్సవం
- సమస్యలను ఏకరువు పెట్టిన వినియోగదారులు
- వెంటనే పరిష్కరించాలంటూ వినతిపత్రాలు అందజేత



విద్యుత్‌శాఖ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న చిత్తారమ్మ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దర్శనం శాకయ్య

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): 'విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు బస్తీలు, కాలనీల్లో కరెంటు కోతలు, తరచూ అంతరాయాలతో ఇబ్బందులు పడుతున్నాం. మా కాలనీలో లోవోల్టేజీ సమస్య ఉన్నది.. ఇందుకు ప్రత్యేకంగా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి. కొన్ని లే అవుట్లలో రోడ్ల వెంబడి ఉన్న ఫుట్‌పాత్‌లపై కాకుండా ప్లాట్లలో ఉన్నాయి.. వాటిని తొలగించాలి. పలు చోట్ల ఇండ్ల మీదుగా విద్యుత్ లైన్లు ఉండటంతో నిత్యం భయంతో గడపాల్సి వస్తున్నది.' ఇలా వివిధ సమస్యలను విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఉన్నతాధికారులు, అధికారుల దృష్టికి స్థానిక వినియోగదారులు తీసుకువచ్చారు.ఆదివారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించింది. గ్రేటర్ పరిధిలోని మెట్రో జోన్, రంగారెడ్డి జోన్‌లలోని పలు సర్కిళ్లలో వినియోగదారులతో నేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను లేఖల ద్వారా అధికారులకు అందజేయడంతో పాటు నిరంతరం నాణ్యమైన సరఫరా చేయడం లేదనే అంశంపైనే ఎక్కువ ఫిర్యాదులు చేశారు. బాలానగర్ చిత్తారమ్మ బస్తీలో లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించి ఐదేండ్లు అవుతున్నా.. వారి పేరిట కాంకుండా జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరిట కరెంట్ బిల్లులు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఇంటి పైనుంచి వెళ్తున్న విద్యుత్ లైన్లను సరి చేయాలని, కొత్తవి ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై పరిష్కారాన్ని కోరుతూ 9 మంది వినతి పత్రాలు సమర్పించారు. కొత్త లైన్లు వేయాలని, వదులుగా ఉన్న తీగలను సరి చేయాలని, లో వోల్టేజీ సమస్య ఉందని, హబ్సిగూడ సర్కిల్ పరిధిలో జరిగిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సమావేశంలో అధికారులకు సమస్యలపై ఫిర్యాదు చేశారు.

### స్పందించడం లేదు...

తమ ప్రాంతంలో కరెంటు సరఫరా నిలిచిపోయిందని ఫిర్యాదు చేసినా సరిగా స్పందించరని, 5-10 నిమిషాల్లో వస్తుందని చెప్పి, గంట గడిస్తే కానీ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కావడం లేదని కొందరు వినియోగదారులు వాపోయారు. ఒక పక్క ప్రభుత్వం విద్యుత్ కోతలు లేవని, 24 గంటలు సరఫరా చేస్తున్నామని ప్రకటిస్తుంటే... క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉన్నదని వినియోగదారులు అధికారులకు వివరించారు. ముఖ్యంగా ఇటీవల వర్షా కాలంలో విద్యుత్ అంతరాయాలు బాగా పెరిగాయని, దీనికి ప్రధాన కారణం క్షేత్ర స్థాయిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతులు సరిగా చేయకపోవడం వల్లే జరుగుతున్నదని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నా, సరిగా స్పందించడం లేదని, రకరకాల కారణాలు చెబుతున్నారే తప్ప..శాశ్వత పరిష్కారం చూపడం లేదని పలువురు వినియోగదారులు సెక్షన్ పరిధిలోని అధికారుల తీరుపై మండిపడ్డారు. డిమాండుకు సరిపడా కరెంటు ఉన్నప్పుడు లోవోల్టేజీ సమస్యకు అవకాశం ఉండదని, కానీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలు చోట్ల లోవోల్టేజీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై పెరిగిన భారాన్ని గుర్తించి, అక్కడ అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం, దాని సామర్థ్యాన్ని పెంచడమో చేయాల్సి ఉన్నా, ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే లోవోల్టేజీ సమస్య తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని పలువురు వినియోగదారులు అధికారుల ముందు వాపోయారు.



ఘట్‌కేసర్‌లో జరిగిన విద్యుత్ వినియోగదారుల సమావేశంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు తమ ధాన్యాన్ని పొలాలు, రోడ్లపై నిలువ ఉంచుతున్నారు. ఎవరు కొంటారా అని పడిగాపులు కాస్తున్నారు. చివరకు దిక్కుతోచక దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది. రంగారెడ్డి జిల్లాలో గత 15 రోజులుగా రైతులు వరి పంటను కోసి అమ్మకానికి ఎదురు చూస్తున్నా.. ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. మరోవైపు బ్యాంకు గ్యారెంటీ తప్పనిసరి అని సర్కారు నిబంధన విధించడంతో మిల్లర్లు ధాన్యం కొనుగోళ్లకు ముందుకు రావడంలేదు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్, కల్వకుర్తి తదితర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు లేక లక్షలాది మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కల్లాల్లో నిలువ ఉంచారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, బ్యాంకు గ్యారెంటీ కొర్రీలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

*- రంగారెడ్డి, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ)*



కొనుగోలు కేంద్రాలు లేక, ధాన్యం తడువడంతో రోడ్డుపై ఆరబోసిన రైతులు

- కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయని సర్కారు
- జిల్లావ్యాప్తంగా పొలాలు, రోడ్లపై వరి ధాన్యపు రాసులు
- బ్యాంకు గ్యారెంటీ కొర్రీలతో కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్న మిల్లర్లు
- దిక్కుతోచక దళారుల చేతుల్లో చిక్కుకుంటున్న అన్నదాతలు

# అన్నదాతలకు అష్టకష్టాలు

### జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

రంగారెడ్డి జిల్లాలో వానకాలం సీజన్‌లో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఈ సీజన్‌లో ముందుగానే జిల్లాలో 1.38 లక్షల ఎకరాల్లో వరి వేశారు. దీంతో కోతలు కూడా ముందుగానే ప్రారంభమయ్యాయి. అయినా ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం శోచనీయం.

### క్వింటాలు రూ.2200లకే..

ఓ వైపు బ్యాంకుల గ్యారెంటీ కొర్రీలతో కొనుగోలుకు మిల్లర్లు దూరంగా ఉన్నారు. మరోవైపు సర్కారు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం సన్న బియ్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 అదనంగా ఇస్తామని ప్రకటించినప్పటికీ ఆచరణలో మాత్రం అందనంత దూరంలో ఉన్నది. ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా దళారులు క్వింటాలుకు రూ.2200లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు.

### ఎక్కడ చూసినా ధాన్యపు రాసులే..

జిల్లాలో వరి కోతలు ప్రారంభం కావడం.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో ఎక్కడ చూసినా ధాన్యపు రాసులే దర్శనమిస్తున్నాయి. రైతులు కొంత మంది పంట పొలాల్లో నిల్వ ఉంచగా.. మరికొంతమంది రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్నారు.

### గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రభుత్వానికి రైతులపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి. గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.500 బోనస్ ఇవ్వాలి. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న రేవంత్ సర్కార్ రైతులపై నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నది. ఈ ధోరణి విడనాడి రైతుల శ్రేయస్సు కోసం పనిచేయాలి.

**- కాలె వీరయ్య, రైతు, ముర్తుజాపల్లి, ఆమనగల్లు మున్సిపాలిటీ**

### కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించడానికి వరి కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటను సేకరించేందుకు సర్కారు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. అకాల వానలు కురిస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదమున్నది. దీంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

**- జోగు వీరయ్య, రైతు, కడ్తాల్ మండలం**



### కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలు లేకపోవడం శోచనీయం. దీంతో అన్నదాతల పరిస్థితి అయోమయంగా తయారైంది. ఎటూతోచని స్థితిలో దళారులను ఆశ్రయిస్తున్నారు. వెంటనే సర్కారు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

**- సుధాకర్‌రెడ్డి, రైతు**

### నేడు మిల్లర్లతో సమావేశం



జిల్లాలో ధాన్యం కొనుగోలుకు నేడు మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. 16 మంది మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయనున్నారు. ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీ తప్పనిసరి చేసిన నేపథ్యంలో మిల్లర్లు కొంత వెనుకడుగు వేస్తున్నారు. వారిని ఒప్పించి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ కూడా అందజేస్తాం.

**- గోపి, డీఎం, సివిల్ సప్లయ్**

# విన్యాసాలు చేసి.. పటాకులు కాల్చి..



## సోషల్ మీడియాలో వీడియో వైరల్

## యువకుడిపై కేసు నమోదు

శేరిలింగంపల్లి, నవంబర్ 3: మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై బైక్ విన్యాసాలు చేస్తూ.. వచ్చి ఐటీసీ కోహినూర్ వద్ద రహదారిపై పటాకులు కాల్చి సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసి హల్‌చల్ చేసిన ఓ యువకుడిపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోను సైబరాబాద్ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. వాహనాలతో రద్దీగా ఉండే కేబుల్ బ్రిడ్జిపై ప్రమాదకర స్థాయిలో బైక్ విన్యాసాలు చేయడంతో పాటు పక్కనే ఉన్న ఐటీసీ కోహినూర్ వద్ద రోడ్డుపై ప్రమాదకర స్థాయిలో బాణాసంచా కాల్చి.. విన్యాసాలు చేసి సోషల్ మీడియాలో వీడియోను వైరల్ చేశారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న రాయదుర్గం పోలీసులు సదరు యువకుడిపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన యువకుడు ఆ వీడియోను పోస్టుచేసినట్లు గుర్తించారు. సదరు బైక్‌కు నంబర్ లేకపోవడంతో నిందితుడి కచ్చితమైన ఆచూకీ లభ్యం కాలేదని రాయదుర్గం సీఐ వెంకన్న తెలిపారు. సదరు యువకుడిపై బీఎన్ఎస్ఎస్ 121 సెక్షన్ కింద ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

# మీ ఇంటికి నేను భరోసా ఇస్తా

బుల్డోజర్లకు అడ్డుగా నిలబడుతాం • మూసీ పరీవాహక కాలనీల వాసులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 3: మూసీ ప్రక్షాళన, సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని పేదలకు బుల్డోజర్లతో అన్యాయం చేయాలని చూస్తే.. తాము బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతామని స్పష్టం చేశారు. ఆదివారం చైతన్యపురి డివిజన్ ద్వారకాపురం కాలనీలో మూసీ పరీవాహక కాలనీలు, బస్తీల ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రేవంత్ సర్కార్ తమ ఇండ్లను ఎప్పుడు కూలుస్తుందోనని పేదలు కంటిమీద కునుకులేకుండా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు తాము అండగా ఉంటామని, అధికారులు ఎలాంటి మార్కింగ్‌లు వేసినా.. ఎలాంటి నష్టం జరుగనివ్వబోమని, 'మీ ఇంటికి నేను భరోసా ఇస్తున్నా'నని సుధీర్‌రెడ్డి మూసీ పరీవాహక కాలనీల ప్రజలకు ధైర్యం చెప్పారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తోట మహేశ్ యాదవ్, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

# పూర్వ వైభవం ఇంకెప్పుడు?

- హెచ్ఎండీఏకు పూర్తి స్థాయి కమిషనర్ ఉన్నా.. మారని పనితీరు
- ఆరు నెలలు గడిచినా.. కనిపించని ఎంసీ మార్క్

సిటీబ్యూరో, నవంబర్ 3(నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏకు ఇప్పట్లో పూర్వవైభవం వచ్చేలా లేదు. పూర్తి స్థాయి మెట్రోపాలిటన్ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించినా.. హెచ్ఎండీఏ పనితీరులో ఏ మాత్రం మార్పు రాలేదు. సిటీ జనాల సమస్యలు దేవుడెరుగు... కనీసం ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టే ఉన్నతాధికారులే కరువయ్యారు. నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో కీలక పాత్రను పోషించే హెచ్ఎండీఏ.. ఇప్పుడా బాధ్యతలను పక్కన పెట్టినట్లు ఉంది. దీంతో సంస్థ పరిధిలో చేపట్టిన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు మూలుగుతుండగా, నగరాన్ని వన్నె తెచ్చే ఏ కొత్త ప్రాజెక్టు ఇప్పటివరకు కార్యరూపంలోకి తీసుకురాలేకపోయారు. పూర్తిస్థాయి కమిషనర్ ఉంటేనే హెచ్ఎండీఏ బాగుపడుతుందంటూ గతంలో ఆరోపణలు చేసిన కాంగ్రెస్ పార్టీయే... అధికారంలోకి వచ్చినా.. తనదైన మార్కును చూపెట్టుకోలేక పోతున్నది. కనీసం అధికారులైనా పనితీరుతో మెప్పిస్తారనుకుంటే... అదీ లేదు. ఫలితంగా ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన హెచ్ఎండీఏలో కార్యకలాపాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

### ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా..

ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా హెచ్ఎండీఏ ఏర్పాటైంది. జీహెచ్ఎంసీ పరిధిని మినహాయిస్తే చుట్టూ 7 జిల్లాల పరిధిలో హెచ్ఎండీఏ విస్తరించి ఉంది. అయితే గత కొన్ని నెలలుగా నగరం అభివృద్ధికి, కొత్త ప్రాజెక్టులకు నోచుకోలేదు. పైగా గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను సైతం పక్కన పెట్టారు. ఫలితంగా హెచ్ఎండీఏ భవిష్యత్ ఏమవుతుందా? అని ఆ సంస్థ ఉద్యోగుల్లోనే ఎంతో ఆందోళన నెలకొన్నది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్ఎండీఏ చైర్మన్‌గా, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఉన్నా ఆరు నెలలుగా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. గత ప్రభుత్వం హైదరాబాద్ మహానగరంతో పాటు శివారు ప్రాంతాల్లో వేల కోట్లతో ప్రాజెక్టులను చేపట్టి, నగరానికి ఎంతో ఖ్యాతిని తీసుకువచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా చేసింది. అలాంటి హెచ్ఎండీఏలో పది నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్న విమర్శలు వస్తున్నాయి. పూర్తి స్థాయి కమిషనర్ వస్తేనే హెచ్ఎండీఏకు పూర్వ వైభవం వస్తుందని, భారీ ప్రాజెక్టులను చేపట్టడం ద్వారా దశ తిరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసేవారు. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ జరగాలంటే పూర్తి స్థాయిలో దృష్టి సారించేందుకు మెట్రోపాలిటన్ కమిషనర్ అవసరమని పట్టణ ప్రణాళిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### పార్కుల్లో మౌలిక వసతులు

పలు కాలనీల్లో ఉన్న హెచ్ఎండీఏ పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. రూ. 4.30 కోట్ల అంచనా వ్యయంతో పలు పార్కుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించారు. గడిచిన కొన్ని నెలలుగా హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న పార్కుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. టాయిలెట్లు, తాగునీటి సదుపాయాలు, వాకింగ్ ట్రాకులు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేకుండా పోయాయి. దీంతో పార్కులకు వచ్చే సందర్శకుల తాకిడి తగ్గుతుండడంతో పాటు అధికారుల నిర్లక్ష్యంపై సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదులు చేశారు. స్పందించిన హెచ్ఎండీఏ యంత్రాంగం పలు పార్కుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టింది. సఫిల్‌గూడ పార్కులో రూ. 24 లక్షలతో స్ట్రీట్ లైట్లు, ఎలక్ట్రిక్ పోల్స్ ఏర్పాటు చేయనున్నారు. సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కులో రూ. 34 లక్షలతో వీధి దీపాలు, నారాయణగూడలోని జీఎస్ మేల్కోటి పార్కులో రూ. 47 లక్షలతో ఎల్ఈడీ లైట్లు, కూకట్‌పల్లిలోని పటేల్ కుంట పార్కులో రూ. 31 లక్షలతో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. సంజీవయ్య పార్కులో రూ. 4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. సందర్శకులు నడిచేందుకు వీలుగా పాత్ వే, టాయిలెట్లు, డస్ట్ బిన్లు, గ్రానైట్ బెంచులు, ప్రహరీ నిర్మాణం వంటి పనులతో ఆధునీకరించనున్నారు.

### కనిపించని ఎంసీ మార్క్...

ఈ ఏడాది జూన్ నెలాఖరున మెట్రోపాలిటన్ కమిషనర్(ఎంసీ)గా సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. పూర్తిస్థాయి కమిషనర్ రావడంతో పాలనా వ్యవహారాలు పరుగులు పెడతాయని, అభివృద్ధి ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ పూర్తిస్థాయి ఎంసీ హోదాలో తన మార్పును ఇప్పటివరకు చూపలేకపోయారనే విమర్శలను మూటగట్టుకున్నారు. ఓఆర్ఆర్ వరకు విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటివరకు ఆయన ఒక్క ప్రాజెక్టుకూ శ్రీకారం చుట్టింది లేదు. కనీసం గత ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ప్రాజెక్టులను కూడా పూర్తి చేయించలేకపోయారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక ఏడు జిల్లాల నుంచి సమస్యల పరిష్కారానికి హెచ్ఎండీఏ కార్యాలయానికి వచ్చే ప్రజల విషయాన్ని పక్కన పెడితే... కనీసం ఉద్యోగుల సమస్యలను కూడా వినలేదనే ఆరోపణలున్నాయి.

### ప్లానింగ్ విభాగం ప్రక్షాళన ఏదీ?

ఇటీవల హెచ్ఎండీఏ ఆదాయానికి గండికొడుతూ కొందరు డిప్యూటేషన్ ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదులను కూడా ఎంసీ పెడచెవిన పెట్టినట్లు తెలిసింది. ప్రైవేట్ కాంట్రాక్టర్లు, వ్యక్తులతో కుమ్మక్కై పార్కింగ్, డెవలప్‌మెంట్ వ్యవహారాలతో కోట్ల ఆదాయాన్ని హెచ్ఎండీఏ కోల్పోతున్నదని సమాచారం అందినా.. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోలేకపోయారు. హైదరాబాద్ నగరానికి వన్నె తీసుకువచ్చే ఎలివేటెడ్ కారిడార్లు, పెండింగ్‌లో ఉన్న స్కైవాక్‌లు, చెరువుల హద్దుల నిర్ధారణ వంటి పనులను కూడా ఇప్పటివరకు సమీక్షించలేదు. దీంతో పాలన పడకేయగా, నిర్లక్ష్యపు ప్రభుత్వ పనితీరుకు హెచ్ఎండీఏ నిదర్శనంగా నిలుస్తున్నదని అధికారులు చర్చించుకుంటున్నారు.